క్లుప్తంగా

అదుపుతప్పిన బైక్.. వ్యక్తికి గాయాలు



అయిజ: మున్సిపాలిటీ పరిధిలోని తుపత్రాల గ్రామ సమీపంలోని మలుపు వద్ద బైక్ అదుపు తప్పి కింద పడడంతో వ్యక్తి గాయపడిన ఘటన బుధవారం జరిగింది. వివరాలు.. మల్దకల్ మండలం ఎద్దులగూడెనికు చెందిన చిన్న నరసింహులు బైక్‌పై ఎమ్మిగనూరుకు వెళ్తుండగా బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. ప్రమాదంలో తలకు తీవ్రగాయాలవడంతో 108లో జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

వ్యక్తిపై కేసు నమోదు

ఉండవెల్లి: మండల కేంద్రంలో జాతీయ రహదారిపై రెండు బైక్‌లు ఎదురెదురుగా మంగళవారం ఢీకొన్నాయి. ప్రమాదంలో తల్లి లత, కుమారుడు గోపిచంద్ గాయపడ్డారు. ఈ క్రమంలో బాధితుల కుటుంబ సభ్యుడు మునిస్వామి ఫిర్యాదు మేరకు బుధవారం గుర్తు తెలియని వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ వీరన్న తెలిపారు.

ఘనంగా మారెమ్మవ్వ ఉత్సవాలు



కేటీదొడ్డి: మండలంలోని కొండాపురం, పాగుంట గ్రామంలోని నూతనంగా నిర్మించిన మారెమ్మవ్వ అమ్మవారి ఆలయంలో ఊర్ల దేవర ఉత్సవాలు బుధవారం వైభవంగా సాగాయి. ఉత్సవాల్లో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బాసు హనుమంతునాయుడు, బీజేపీ జిల్లా ఇన్‌చార్జ్ డీకే స్నిగ్ధారెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ సరిత హాజరై అమ్మవారి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ కుర్వ హనుమంతు, మాజీ జెడ్పీటీసీ రాజశేఖర్, వైస్ ఎంపీపీ రామకృష్ణనాయుడు, నాయకులు ఉరుకుందు, శేఖర్‌రెడ్డి, చంద్రశేఖర్, రాజేష్, పవన్, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి శ్రీహరికి శుభాకాంక్షల వెల్లువ



ఆత్మకూర్: రాష్ట్ర మంత్రి, మక్తల్ శాసనసభ్యుడు డాక్టర్ వాకిటి శ్రీహరిని దేవరపల్లి గ్రామస్తులు మక్తల్‌లోని ఆయన నివాసంలో బుధవారం కలిసి సత్కరించారు. నియోజకవర్గానికి మంత్రి పదవి లభించడంతో అభివృద్ధి పరుగులు పెడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నాగన్న, కాంగ్రెస్ నాయకులు దశరథ్, రాములు, వెంకటన్న తదితరులు పాల్గొన్నారు.

వనపర్తి రూరల్: పెబ్బేరు మండల ముదిరాజ్ సంఘం నాయకులు గోనెల బాలస్వామి, గోనెల సహదేవ్, బాలరాజు, సాప్పురి బీచుపల్లి, ఎల్లస్వామి, శ్రీరంగాపురం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాములుయాదవ్, నాయకులతో కలిసి కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌యాదవ్ హైదరాబాద్‌లో మంత్రి వాకిటి శ్రీహరిని కలిసి శాలువాతో సన్మానించారు. మంత్రిని కలిసిన వారిలో రాజీవ్‌రెడ్డి, పెంటన్న తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి



కేటీదొడ్డి: రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని డీఏఓ సక్రియానాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంతో పాటు కుచినెర్ల, నందిన్నె, వెంకటాపురం, పాతపాలెం గ్రామాల్లో ఫర్టిలైజర్ షాపులను ఆయన తనిఖీ నిర్వహించారు. ఎరువుల వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలని, ఎరువులను పీఓఎస్ మిషన్ ద్వారానే విక్రయించాలన్నారు. రైతుల ఆధార్ కార్డు తీసుకున్న తర్వాతనే ఎరువులు విక్రయించాలని, తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని యాజమానులకు స్పష్టం చేశారు. అనంతరం మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో రైతులకు సబ్సిడీ జీలుగ విత్తనాలు అందజేశారు.

ఘనంగా 'ఏరువాక' సంబరాలు



గట్టులో ఉత్సాహంగా ఎద్దుల బండ్ల పోటీలు

సాక్షి నెట్‌వర్క్: ముంగారి సేద్యం ప్రారంభంలో జ్యేష్ఠశుద్ధ పౌర్ణమి నాడు జరుపుకునే ఏరువాకను జిల్లా వ్యాప్తంగా బుధవారం రైతులు ఘనంగా జరుపుకున్నారు. తొలకరి జల్లులు పలకరించడం (రుతుపవనాల ప్రవేశంతో వచ్చే వానల)తో పొలాల్లో నాగలితో దున్నటంతో వ్యవసాయ పనులు ప్రారంభమవుతాయి. కాడెద్దులకు పూజలు చేసి పిండి వంటల నైవేద్యాన్ని తినిపిస్తారు. ఈ ఏడాది పంటలు బాగా పండాలని కోరుకుంటూ గ్రామ దేవతలకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించారు.

❖ గద్వాల పట్టణంలో ఏరువాక పౌర్ణమిని ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని సుంకులమ్మ, ఈదమ్మ ఆలయాల్లో నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. 32వ వార్డులోని చింతలపేట కాలనీలో నిర్వహించిన ఎద్దుల ఊరేగింపును ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి ప్రారంభించారు. 8వ వార్డులోని బీసీ కాలనీ, 23వ వార్డులో తెలుగుపేట కాలనీలో నిర్వహించిన ఎద్దుల ఊరేగింపును జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ సుంకులమ్మ, ఈదమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. చింతలపేట కాలనీలో తోరణం తెంచే పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించి రైతులను ఉత్సాహ పరిచారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

❖ మానవపాడు మండలంలోని ఆయా గ్రామాల్లో ఏరువాక పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రంలో కాడెద్దుల ఊరేగింపు నిర్వహించారు.

❖ అయిజ మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ఏరువాక పౌర్ణమి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామ దేవతలు సుంకులమ్మ, సవారమ్మలకు నైవేద్యం సమర్పించి పూజలు చేశారు. కాడెద్దులను అలంకరించి ఊరేగించారు.

❖ గట్టు మండల కేంద్రంలోని సంత బజారులో ఎద్దుల పరుగు పందెం, ఎద్దుల బండ్ల గిరక పోటీలు ఏరువాక పౌర్ణమి సందర్భంగా నిర్వహించారు.

❖ ఇటిక్యాల మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఏరువాక సంబరాలు అంబరాన్నంటాయి. గ్రామదేవత సుంకులమ్మకు బోనాలతో ప్రత్యేక నైవేద్యం సమర్పించారు. ఎద్దులను అలంకరించి ఊరేగింపు నిర్వహించారు.

❖ ఎర్రవల్లి మండలంలోని ఆయా గ్రామాల్లో ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకొని ప్రజలు సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. పాడి పశువులను పూజించి ఆనందోత్సవాల నడుమ అరక దున్నడం ప్రారంభించారు. సుంకులమ్మకు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

❖ ధరూరు మండల పరిధిలోని నెట్టెంపాడు గ్రామంలో ఏరువాక పౌర్ణమి ఘనంగా జరుపుకున్నారు. ఏరువాక సందర్భంగా గ్రామంలోని నిర్వహించిన తోరణం తెంపే పోటీల్లో సాంబశివుడికి చెందిన ఎద్దులు విజేతగా నిలిచాయి.

❖ మల్దకల్ మండలంలో ఏరువాక పౌర్ణమి వేడుకలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గ్రామ దేవతలు సుంకులమ్మ, సవారమ్మ, ఈదమ్మ దేవతలకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఎద్దులను రంగులతో అలంకరించి ఊరేగింపు నిర్వహించారు. మండల కేంద్రంలో నిర్వహించిన వేడుకల్లో సింగిల్ విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డి, వివిధ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

❖ ఉండవెల్లి మండలంలోని ఆయా గ్రామాల్లో ఏరువాక పౌర్ణమి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో ఎద్దులతో ఊరవాకిలి వద్దకు రైతులు చేరి తోరాణాలను చర్లకోలతో కొట్టి తొలగించడం ఆనవాయితీగా వస్తుంది. అనంతరం రైతు సంఘం ఆధ్వర్యంలో ఎద్దు ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు.



జిల్లా కేంద్రంలో సుంకులమ్మ దేవాలయం వద్ద బారులుతీరిన భక్తులు



షేకుపల్లిలో సుంకులమ్మకు బోనాలు సమర్పిస్తున్న భక్తులు



కృష్ణాపురంలో పూజలందుకున్న సుంకులమ్మ

నడిగడ్డలో విద్యా వ్యవస్థ అస్తవ్యస్తం



మాట్లాడుతున్న బీజేపీ నాయకురాలు స్నిగ్ధారెడ్డి

గద్వాలటౌన్: నడిగడ్డలో విద్యా సమస్యలు పరిష్కరించడంలో పాలకులు విఫలమయ్యారని అఖిల పక్ష నాయకులు ధ్వజమెత్తారు. బాలల హక్కుల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక పాత బస్టాండ్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. ధర్నాలో అఖిలపక్ష నాయకులతో పాటు వివిధ ప్రజా సంఘాల నాయకులు హాజరై మాట్లాడారు. నడిగడ్డలో పాలకుల అవగాహన రాహిత్యంతో విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ గురుకుల పాఠశాలలు అరకొర వసతులతో కొనసాగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు ఏ ఒక్క గురుకుల పాఠశాలకు పక్కా భవనాన్ని నిర్మించలేదన్నారు. నాయకులకు పర్సెంటీజీలపై ఉన్న శ్రద్ధ విద్యా సమస్యలపై కొరవడిందని మండిపడ్డారు. జిల్లాలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేరన్నారు. పాలకుల వైఫల్యం కారణంగానే నడిగడ్డలో చెప్పుకోదగ్గ విద్యా సంస్థలు మంజూరు కావడం లేదని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి సైతం నడిగడ్డపై వివక్ష చూపుతున్నారన్నారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు ఆంజనేయులు, డీకే స్నిగ్ధారెడ్డి, హనుమంతునాయుడు, నాగర్‌దొడ్డి వెంకట్రాములు, ప్రభాకర్, పల్లయ్య, రహమాన్ పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు సద్వినియోగించుకోవాలి



సుల్తానాపురం రెవెన్యూ సదస్సులో అధికారులు

మల్దకల్: భూ భారతి రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ ఝాన్సీరాణి సూచించారు. మండలంలోని ఎల్కూర్, మద్దెలబండ గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ఆమె పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో మొత్తం 98 దరఖాస్తులు వచ్చినట్లు ఝాన్సీరాణి తెలిపారు.

కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు

అలంపూర్: మండల పరిధిలోని సుల్తానాపురం గ్రామంలో భూ భారతి రెవెన్యూ సదస్సులు బుధవారం నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది రైతులు నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రంలో సీనియర్ సహాయకులు సుచిత్ర, ఆంజనేయులు, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

55 దరఖాస్తులు అందజేత

ఎర్రవల్లి: మండల పరిధిలోని వేముల గ్రామంలో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి 55 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ నరేష్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ శంశీర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తుమ్మలచెర్వులో రెవెన్యూ సదస్సు

గట్టు: మండల పరిధిలోని తుమ్మలచెర్వు గ్రామంలో తహసీల్దార్ మదన్‌మోహన్‌గౌడ్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. వ్యవసాయ పొలాలకు సంబంధించి మొత్తం 22 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



తుమ్మలచెరువులో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ మదన్‌మోహన్‌గౌడ్

రైతులపై కేసులు ఎత్తివేయాలి



అలంపూర్‌లో నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు

అలంపూర్: రైతులపై పెట్టిన అక్రమ కేసులను తక్షణమే ఎత్తివేయాలని సీపీఎం జిల్లా కమిటి సభ్యులు జీ.రాజు, జీకే ఈదన్న డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట అంబేడ్కర్ విగ్రహం వద్ద రైతులపై పెట్టిన అక్రమ కేసులను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. రాజోళి మండలం పెద్దధన్వాడలో ఇథనాల్ కంపెనీకి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన అనుమతులు తక్షణమే రద్దు చేయాలన్నారు. ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణంతో ఈ ప్రాంతంలో గాలి, ధ్వని కాలుష్యం, మనుషులు, జంతువులు రోగాల బారిన పడే అవకాశం ఉందన్నారు. సారవంతమైన భూములు భూసారం తగ్గి పంట దిగుబడులు వచ్చే పరిస్థితి ఉండదన్నారు. తాగు, సాగు నీరు కలుషితమవుతాయన్నారు. ఇథనాల్ కంపెనీ వద్దని 12 గ్రామాల ప్రజలు కొన్ని నెలలుగా నిరసనలు చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. గ్రామసభ అనుమతి, ప్రజా అభిప్రాయాలకు భిన్నంగా పరిశ్రమలు నెలకొల్పాడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. ప్రైవేటు గుండాలతో భయాందోళనలకు గురిచేసి ఫ్యాక్టరీ నిర్మాణానికి యత్నిస్తున్నారని ఆరోపించారు. నియోజకవర్గంలోని కాంగ్రెస్ ముఖ్య నాయకులు కమీషన్లకు కక్కుర్తిపడి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆరోపించారు. కంపెనీ యాజమాన్యంతో కుమ్మక్కై ప్రజల జీవితాలను నాశనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులకు ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. పరిశ్రమ యాజమాన్యానికి సహకరిస్తూ రైతులను, ప్రజలను రెచ్చగొడుతున్న రాజోళి ఎస్ఐను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. 42 మంది రైతులపై పెట్టి నాన్‌బెయిలబుల్ కేసులను తక్షణమే ఎత్తివేయాలన్నారు. జైలులో ఉన్న 12 మందిని బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటస్వామి, నరసింహ్మ, అయ్యప్ప, పుల్లన్న, ఖాజా పాల్గొన్నారు.

కంపెనీ అనుమతులు రద్దు చేయాలి

గట్టు: ఇథనాల్ కంపెనీ అనుమతులను రద్దు చేయాలని సీపీఎం పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో సీపీఎం ర్టీ నాయకులు ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటుకు వ్యతిరేకంగా ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ నాయకులు వీవీ నర్సింహ మాట్లాడుతూ.. రాజోళి మండలం పెద్దధన్వాడలో ఏర్పాటు చేస్తున్న ఇథనాల్ కంపెనీ గుండా పర్యావరణానికి హాని కలుగనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యురాలు నర్మద, సభ్యులు ఆంజనేయులు, స్వామి, శాంతప్ప, గోవిందు పాల్గొన్నారు.

ప్రజల ప్రాణాలతో చెలగాటం

ధరూరు: ప్రభుత్వాలకు ప్రజల ప్రాణాలకంటే కార్పొరేటర్ల లాభాలే ముఖ్యమని భావిస్తున్నట్లు కన్పిస్తుందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఉప్పేరు నర్సింహ అన్నారు. మండల కేంద్రంలోని వైఎస్సార్ చౌరస్తాలో సీపీఎం, హమాలీ సంఘం నాయకులతో కలసి ఇథనాల్ పరిశ్రమకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పెద్దధన్వాడలో ఇథనాల్ పరిశ్రమకు వ్యతిరేకంగా సీపీఎం దశల వారీగా ఉద్యమం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మేకల నర్సింహులు, మోష, వినయ్, ఆంజనేయులు, దేవాదసు, ప్రవీణ్, తిమ్మప్ప, గోవిందు పాల్గొన్నారు.



ధరూరు వైఎస్సార్ చౌరస్తాలో నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు



గట్టులో ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

నాణ్యమైన భోజనం అందించాలి



అలంపూర్: విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని ఎంఈఓలు శివప్రసాద్, రామకృష్ణ అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని విశ్వశాంతి డిగ్రీ కళాశాలలో ఉండవెల్లి, మానవపాడు మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వంట ఏజెన్సీ సిబ్బందికి బుధవారం నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మెనూ ప్రకారం శుచికరం, పౌష్టికరమైన భోజనం అందించాలన్నారు. వంటగదిని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. నాణ్యతలేని వస్తువులను వినియోగించకూడదని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్ఎం విష్ణు, తక్కశీల స్కూల్ కాంప్లెక్స్ జీహెచ్ఎం అనితాదేవి, ఉండవెల్లి స్కూల్ కాంప్లెక్స్ ఇన్‌చార్జ్ మద్దిలేటి, ప్రధానోపాధ్యాయులు, వంట ఏజెన్సీ సిబ్బంది, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ బడిలోనే బంగారు బాట



మేడికొండలో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సీడీపీఓ హేమలత, సిబ్బంది

అయిజ: చిన్నారులకు అంగన్‌వాడీ బడిలోనే బంగారు బాట వేయాలని ఐసీడీఎస్ సీడీపీఓ హేమలత అన్నారు. బుధవారం మండలంలోని మేడికొండలో 'అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట' కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ టీచర్లు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీడీపీఓ గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ ప్రత్యేక అధికారి పవన్‌కుమార్, టీచర్లు, ఆయాలు, విద్యార్థులు పాల్గొన్నారు.

మానవపాడు: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సూపర్‌వైజర్ లక్ష్మి ఆధ్వర్యంలో అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులను అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలని గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



మానవపాడులో అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది

పదకొండేళ్ల పాలనలో అభివృద్ధి దిశగా దేశం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ రాంచంద్రరావు, బీజేపీ నాయకులు

గద్వాల: బీజేపీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం పదకొండేళ్లుగా అవినీతిరహిత పాలన అందిస్తూ ప్రపంచ దేశాలతో పోటీపడేలా దేశాన్ని అభివృద్ధి దిశగా దూసుకెళ్తుందని మాజీ ఎమ్మెల్సీ రామ్‌చంద్రరావు అన్నారు. బుధవారం ఆయన గద్వాల జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2004–2014వరకు దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన మొత్తం స్కాంలమయంగా మారిందని ధ్వజమెత్తారు. తరువాత వచ్చిన ఎన్డీఏ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం ఒక్క చిన్న అవినీతికి తావులేకుండా సుపరిపాలన అందిస్తున్నట్లు తెలిపారు. అమృత్‌పథకంలో భాగంగా అనేక కార్యక్రమాలను ప్రధాని నరేంద్రమోదీ చేపడుతున్నట్లు తెలిపారు. చిరువ్యాపారాలు దేశఆర్థిక వ్యవస్థకు మూలస్తంభమని వారిని బలంగా నిలబెట్టేందుకు కేంద్రం ప్రత్యేక పథకాలు అమలు చేస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాలకు 99శాతం రోడ్డు పనులు పూర్తయ్యాయని, సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ విధానంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. పీఎం ఆవాస్ యోజన, ఆయుష్మాన్‌భారత్ భారతీయ జనఔషధి, పీఎం కిసాన్‌సమ్మాన్ నిధి వంటి పథకాలన్నీ దేశ ప్రజల ఆశలను నెరవేర్చాయన్నారు. కార్యక్రమంలో నాయకులు రామాంజనేయులు, డీకే స్నిగ్ధారెడ్డి, బండల వెంకట్రాములు, మిర్జాపురం వెంకటేశ్వర్‌రెడ్డి, శివారెడ్డి, జయశ్రీ, రవికుమార్, దేవదాస్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతుకు సాగు కష్టాలు

- పెరిగిన కౌలు రేట్లు, పెట్టుబడి వ్యయం
- ఆదుకోని ప్రభుత్వ పథకాలు
- పంటకు గిట్టుబాటు ధరలు లేక విలవిల



చెన్నిపాడులో దుక్కి దున్నతున్న రైతు

మానవపాడు: మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా తయారైంది కౌలు రైతుల పరిస్థితి. గుంట జాగ లేని రైతులు వ్యవసాయంపై మమకారంలో భూమిని కౌలు తీసుకొని సాగు చేస్తున్న ప్రభుత్వాల నుంచి ఆర్థిక సాయం అందక, పెట్టుబడి భారం, అవస్థలు పడుతున్నారు. కౌలు ఒప్పందాలన్ని ప్రభుత్వ మాటలకే పరిమితమవడం, పండించిన పంటకు గిట్టుబాటు ధరలు లేక కౌలు రైతులు విలవిలలాడుతున్నారు. ప్రభుత్వాలు భూమి ఉన్న రైతులకు అందిస్తున్న సాయం అందక పెట్టుబడుల కోసం అప్పుతెచ్చి మరీ పంట సాగు చేయాల్సిన పరిస్థితి ఉందని వాపోతున్నారు.

నియోజకవర్గ పరిధిలో

అలంపూర్ నియోజకవర్గ పరిధిలోని 8 మండలాల్లో దాదాపు 1250 మంది కౌలు రైతులు సుమారు 20 వేల ఎకారాల్లో సాగు చేపట్టారు. పండించిన పంటకు సరైన గిట్టుబాట ధరలేక పోవడం, ప్రభుత్వం తరఫు నుంచి ఆర్థిక సాయం అందకపోవడంతో కౌలు రైతులు సాగుపై మొగ్గు చూపడం లేదు.

సుమారు రూ.12 వేలు కౌలు

నియోజకవర్గ పరిధిలో బోరుబావులు, నీటి లభ్యత ఉన్న కాలువలు, ఆయకట్టులో వానాకాలం సీజన్‌లో ఎకరాకు రూ.12 వేల నుంచి సుమారు రూ.40వేల దాకా కౌలు వసూలు చేస్తున్నారు. పెట్రోలు, డీజిల్ ధరలు పెరగడంతో దుక్కిదున్నే ట్రాక్టర్ రేటు పెరిగింది. నాటు, కలుపుతీతకు కూలీల రేట్లు పెరగడం కౌలు రైతులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. అలంపూర్ నియోగకవర్గంలో ప్రస్తుతం సాగవుతున్న భూమిలో 50 శాతం పైగా కౌలు రైతుల చేతుల్లోనే ఉంది. వారంతా దాదాపు భూమిలేని, సన్న, చిన్నకారు రైతులు ఎక్కువగా ఉన్నారు. పెరిగిన ధరలు, పెట్టుబడి దృష్ట్యా కౌలుదారులను ఆదుకునే మార్గాలపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించాలని కౌలు రైతులు కోరుతున్నారు.

కౌలు ధరలు పెరిగాయి



ఏడాదికేడాది కౌలు ధరలు పెరుగుతూనే ఉన్నాయి. గ్రామంలో ఎకరాకు రూ.13వేల నుంచి రూ.26 వేలు వసూలు చేస్తున్నారు. కూలీ ఖర్చులు పెరిగి, కౌలు రైతుల పరిస్థితి దయనీయంగా ఉంది. కౌలు రైతులకు ప్రభుత్వ పథకాలు అమలు చేయాలి.

- మద్దిలేటి, కౌలురైతు, చెన్నిపాడు

పెట్టుబడి భారం



ఎకరాకు మిర్చి సాగుకు రూ.2.50 లక్షలు, పత్తి సాగుకు రూ. 60వేలు దాకా ఖర్చు వస్తుంది. గిటుబాటు ధర, ఉచితంగా ఎరువులు అందించాలి. కౌలు రైతుకు ప్రభుత్వం న్యాయం చేయాలి. నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు అందుబాటులో ఉండేలా చూడాలి.

- నాగేష్, కౌలు రైతు, మానవపాడు